క్లుప్తంగా

వలంటీర్ రాజీనామా


సత్యనారాయణ

కుక్కునూరు: మారేడుబాక సచివాలయానికి చెందిన వలంటీర్ సత్యనారాయణ రాజీనామా చేశారు. సోమవారం తన రాజీనామా పత్రాన్ని సెక్రటరీ సతీష్‌కు అందించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందించడంలో వలంటీర్‌గా ఎటువంటి పక్షపాతం లేకుండా పనిచేశామని అన్నారు. పార్టీల తారతమ్యం చూపకుండా ప్రతి గుమ్మానికి సంక్షేమ పథకాలు అందించిన తమను టీడీపీ, జనసేన నాయకులు ద్రోహులుగా చిత్రీకరిస్తున్నారని, దీనిని తట్టుకోలేక బాధతో వలంటీర్ పోస్టుకు రాజీనామా చేసినట్లు చెప్పారు.

రేపటి నుంచి పింఛన్ల అందజేత

కామవరపుకోట: ఎన్నికల కోడ్ దృష్ట్యా ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు గ్రామ సచివాలయంలో ఈనెల 3వ తేదీ నుంచి పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో జంగం స్వర్ణభారతి తెలిపారు. మండలంలో గల మొత్తం 16 సచివాలయాల్లో సుమారు 8315 మంది లబ్ధిదారులకు సుమారు రూ.2 కోట్ల 47 లక్షల 60 వేలు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. పింఛన్ లబ్ధిదారులు తమ వెంట ఆధార్ కార్డ్ తప్పని సరిగా తీసుకురావాలన్నారు.

భద్రాద్రికి పాదయాత్ర


రామానుజపురం నుంచి భక్తుల పాదయాత్ర

కొయ్యలగూడెం: ప్రముఖ పుణ్యక్షేత్రం భద్రాచలానికి రామానుజపురం గ్రామం నుంచి భక్తులు సోమవారం పాదయాత్ర చేస్తూ తరలి వెళ్లారు. తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి జిల్లాలో 160 కిలోమీటర్ల దూరంలో ఉన్న క్షేత్రానికి రామనామ సంకీర్తన చేస్తూ వెళుతున్న భక్తుల ర్యాలీని సర్పంచ్ అడపా నాగలక్ష్మి ప్రారంభించారు. మూడు రోజులపాటు పాదయాత్ర నిర్వహిస్తున్నామన్నారు. 55 మంది భక్తులు చేతితో ఒలిచిన 50 కేజీల తలంబ్రాలు బియ్యాన్ని సీతారామచంద్రులకు సమర్పిస్తున్నట్లు తెలిపారు. మద్దాల రాజు, యేసులంక నాగార్జున, కోనే శ్రీను, ఎర్రగడ్డ చిన్నమ్మ తదితరుల సౌజన్యంతో భక్తులకు మూడు రోజులపాటు వసతి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు భక్తులు తెలిపారు.

అవధులు లేని అభిమానం


మా నమ్మకం నువ్వే జగనన్న అంటూ బ్యానర్‌ను ప్రదర్శిస్తున్న అభిమానులు

కొయ్యలగూడెం: వైఎస్సార్ సీపీ పట్ల ఉన్న అభిమానానికి అవధులు లేవని అభిమానులు నిరూపించారు. మార్చి 31వ తేదీ రాత్రి జరిగిన ఢిల్లీ–చెన్నై టీ20 క్రికెట్ మ్యాచ్‌ను వీక్షించేందుకు పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు, ఏఎంసీ డైరెక్టర్ తోట జయబాబు నేతృత్వాన్న పది మందికి పైగా సభ్యులు విశాఖపట్నం వెళ్లి చెన్నై టీంకి మద్దతు పలికారు. ఈ మ్యాచ్‌లో 'మా నమ్మకం నువ్వే జగనన్న' అంటూ బ్యానర్‌ను ప్రదర్శించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై తమకున్న అభిమానాన్ని చాటుకున్నారు.

ఈసీ పునఃపరిశీలించాలి

కొయ్యలగూడెం: వలంటీర్లపై విధించిన ఆంక్షలను ఎలక్షన్ కమిషన్ పునఃపరిశీలించాలని ఏపీ వినియోగదారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏఆర్‌కే హనుమంతరావు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. పింఛన్లు పంపిణీ చేసే విషయంలో వలంటీర్ల సేవలపై విధించిన ఆంక్షలను ఈసీ చీఫ్ ముఖేష్‌కుమార్ తొలగించాలన్నారు. ఇంటింటికీ అర్హులైన వారికి పింఛన్ల పంపిణీ విధానం వలన ఎంతోమందికి ఇబ్బందులు తొలగాయని అన్నారు. ఈసీ ఆంక్షలతో వారందరూ ఇప్పుడు సచివాలయాలకు వెళ్లి పింఛన్లు తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. దీనివలన వృద్ధులు, వికలాంగులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందని, తీవ్రమైన ఎండలకు వారు అవస్థలు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో ఎలక్షన్ కమిషన్ మానవతా దృక్పథంతో వ్యవహరించాలని ఆయన కోరారు.

మత సామరస్యాన్ని చాటేలా..


ఇఫ్తార్‌లో ముస్లిం సోదరులతో పాల్గొన్న క్రైస్తవులు

చింతలపూడి: క్రైస్తవులు ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఇచ్చి మత సామరస్యాన్ని చాటుకున్నారు. రంజాన్ సందర్భంగా స్థానిక జామియ మస్జిద్‌లో సోమవారం ఉపవాస దీక్ష చేస్తున్న ముస్లింలకు బోయగూడెం ఆర్‌సీఎం చర్చి ఫాదర్ కామా మాధ్యు (ఇఫ్తార్) తేనేటి విందు ఇచ్చారు. హిందూ, ముస్లిం, క్రైస్తవులు సోదర భావంతో కలిసిమెలిసి జీవించాలని ఈ సందర్భంగా పలువురు ఉద్బోధించారు. ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గ్జేవియర్, జామియ మస్జిద్ కమిటీ అధ్యక్షుడు ఎస్‌డీ రహీం(బాబు), ప్రధాన కార్యదర్శి ఎండీ జిలాని, జమాతే ఇస్లామి హింద్ పట్టణ అధ్యక్షుడు ఎస్‌కే హుస్సేన్, ఎండీ అక్బర్ ఆలి, ఎస్‌కే ఆజాద్‌బాబు పాల్గొన్నారు.

పోలవరంలో ప్రగతి బాటలు

- వైఎస్సార్ సీపీ పాలనలో మారిన గ్రామాల రూపురేఖలు
- గ్రామాల్లో మౌలిక సదుపాయాలకు పెద్దపీట
- హర్షం వ్యక్తం చేస్తున్న నియోజకవర్గ ప్రజలు

బుట్టాయగూడెం: అభివృద్ధి, సంక్షేమ ఫలాలు చిట్ట చివరి లబ్ధిదారులకూ అందాలని, గ్రామాల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించాలని గ్రామాల్లో ప్రజలు బాగుండాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం. గడిచిన ఐదేళ్ల పాలనలో అనేక విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి పోలవరం నియోజకవర్గంలోని గిరిజన గ్రామాల స్థితిగతులను మార్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుంది. నాడు టీడీపీ పాలనలో రహదారులు, పాఠశాలల అధ్వానంగా ఉండేవి. జగనన్న వచ్చాక వాటి రూపురేఖలు మారాయి. గ్రామ సచివాలయం, రైతుభరోసా, విలేజ్ క్లీనిక్ భవనాల నిర్మాణాలతో గ్రామ స్వరూపాలు మారాయి. సంక్షేమ పాలను చేస్తున్న జగనన్న పాలను మళ్లీ రావాలని ప్రజలు కోరుకుంటున్నారు.


బుట్టాయగూడెంలోని గ్రామ సచివాలయం


జీలుగుమిల్లి మండలం బర్రింకలపాడులో గురుకుల పాఠశాల

అభివృద్ధి ఇలా...

- గ్రామ సచివాలయ భవనాలు – 108
- అంచనా వ్యయం – రూ.44 కోట్ల 87 లక్షలు
- రైతు భరోసా కేంద్రాలు – 108
- అంచనా వ్యయం – రూ.24 కోట్ల 17 లక్షలు
- విలేజ్ క్లినిక్‌లు – 78
- అంచనా వ్యయం – రూ.12 కోట్ల 14 లక్షలు
- రోడ్ల అభివృద్ధి పనులు – 16
- మొత్తం అంచనా వ్యయం – రూ.60 కోట్లు
- గడపగడపకూ మన ప్రభుత్వంలో 108 సచివాలయాల పరిధిలో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు వంటి పనులు
- ఒక్కో సచివాలయానికి రూ. 40 లక్షలు
- మొత్తం అభివృద్ధి పనులకు అంచనా వ్యయం – రూ.43 కోట్ల 20 లక్షలు


వేలేరుపాడు మండలం మేడేపల్లిలో రైతు భరోసా కేంద్రం


బుట్టాయగూడెం మండలం రాగప్పగూడెంలో నిర్మిస్తున్న మంచినీటి వాటర్ ట్యాంక్


బుట్టాయగూడెం మండలం మర్లగూడెంలో నాడు-నేడులో రూపుదిద్దుకున్న పాఠశాల


బుట్టాయగూడెం- దొరమామిడి రోడ్డు


మారుమూల గిరిజన గ్రామం రెడ్డికోపల్లికి రహదారి నిర్మించిన దృశ్యం


మర్లగూడెంలో బెంచీలపై కూర్చుని చదువుకుంటున్న విద్యార్థులు


కొయ్యలగూడెం మండలం బయ్యనగూడెం ఎంపీపీ పాఠశాలలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్


బుట్టాయగూడెం మండలం రెడ్డిగణపవరంలో నిర్మించిన పాల శీతలీకరణ కేంద్రం


బుట్టాయగూడెం మండలం రెడ్డిగణపవరంలో రైతుల ధాన్యం నిల్వ చేసే గోడౌన్

ముస్లింలు వైఎస్ జగన్‌కు అండగా నిలవాలి


ఇఫ్తార్ విందులో పాల్గొన్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజు తదితరులు


ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్ తదితరులు

జంగారెడ్డిగూడెం: రంజాన్‌మాసం సందర్భంగా రాష్ట్ర షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ అక్బర్ పట్టణంలో నిర్వహించిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ చింతలపూడి ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజు, ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విజయరాజు, సునీల్ కుమార్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింలకు ఎన్నో సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు చేశారన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ఘన విజయం చేకూర్చి జగన్‌మోహన్ రెడ్డికి అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, జెడ్పీటీసీలు పోల్నాటి బాబ్జి, నీరజ, చింతలపూడి ఏఎంసీ చైర్మన్ జగ్గవరపు జానకిరెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీవీఆర్ చౌదరి, పామర్రు నియోజకవర్గ పరిశీలకులు మండవల్లి విజయసారధి, పోలవరం నియోజకవర్గ పరిశీలకులు జెట్టి గురునాధరావు, పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు చిటికెల అచ్యుత రామయ్య, వామిశెట్టి హరిబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, రాష్ట్ర మహిళా కార్యదర్శి కాసర తులసీరెడ్డి, నాయకులు మేడవరపు విద్యాసాగర్, బత్తిన చిన్న, గూడపాటి రాధాకృష్ణ, టిప్‌టాప్ బాజీ, గురజాల పార్థసారథి, షేక్ మస్తాన్, కౌన్సిలర్‌లు, మసీదుల నిర్వాహకులు, ముస్లింలు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

చింతలపూడి నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం


అన్నపనేనివారిగూడెంలో మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న విజయరాజు

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజు
- అన్నపనేనివారిగూడెంలో మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం కార్యక్రమం

లింగపాలెం: చింతలపూడి నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజు అన్నారు. లింగపాలెం మండలం అన్నపనేనివారిగూడెంలో గ్రామ సర్పంచ్ దొడ్డిగర్ల రవీంద్ర ఆధ్వర్యంలో సోమవారం ఎన్నికల ప్రచారం, మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ఫ్యాన్ గుర్తుకే ఓట్లు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా విజయరాజు మాట్లాడుతూ ప్రతి గ్రామం, ప్రతి కుటుంబంలో మరింత అభివృద్ధి, సంక్షేమం కోసం ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్‌ను అత్యంత మెజార్టీతో గెలిపించాలని కోరారు. మీ కుటుంబాల్లో మేలు జరిగితేనే నాకు ఓట్లు వేయండని అడిగిన దమ్మున్న నాయకుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని అన్నారు. మళ్లీ జగనన్న సీఎం అయితేనే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ మందలపు సాయిబాబు, పార్టీ మండల అధ్యక్షుడు కొఠారి మోహన్, వైస్ ఎంపీపీ మట్టా సురేష్, పార్టీ ముఖ్యనేత ముసునూరి వెంకటేశ్వరరావు, మాజీ సొసైటీ చైర్మన్ ఏపూరి సూరిబాబు, నాయకులు ఇనుగంటి సతీష్, మందలపు నరసింహరావు, కరికినేని రఘు, మందలపు చిన్నచంటియ్య, తదితరులు పాల్గొన్నారు.

తనిఖీల్లో రూ.72 వేల నగదు స్వాధీనం

కామవరపుకోట: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కామవరపుకోట ఎన్నికల చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీల్లో రూ.72 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎన్నికల అధికారి మహమ్మద్ మోహిద్దీన్ తెలిపారు. స్వాధీన పరుచుకున్న నగదును ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారిణి సత్యవేణికి అందజేశారు. సోమవారం ఎన్నికల చెక్‌పోస్టును జంగారెడ్డిగూడెం డీఎస్పీ రవిచంద్ర ఆకస్మిక తనిఖీ చేశారు. వాహనాల రాకపోకలపై నిఘా పెంచాలని ఆయన సూచించారు.

వైఎస్సార్ సీపీకే పట్టం కట్టాలి

- ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాజ్యలక్ష్మి
- పోలవరంలో ఎన్నికల ప్రచారానికి విశేష స్పందన


పోలవరంలో కడెమ్మతల్లి ఆలయం నుంచి ప్రచారం ప్రారంభిస్తున్న దృశ్యం

పోలవరం రూరల్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. పోలవరం గ్రామంలో ఎమ్మెల్యే బాలరాజు, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తొలుత గ్రామ దేవత కడెమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ బుగ్గా మురళీకృష్ణ ఆధ్వర్యంలో స్థానిక ప్రజాప్రతినిధులు పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికి వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా తెల్లం రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పథకాలతో పాటు అనేక పథకాలను అమలు చేసి ప్రతి ఇంటికీ లబ్ధి చేకూరేలా చేశారన్నారు. అవ్వాతాతలకు పింఛన్లు, అక్కా చెల్లెళ్లకు ఆసరా, చేయూత పథకాలు, అన్నదాతలకు రైతు భరోసా వంటి పథకాలను నూటికి నూరుశాతం అమలు చేశారన్నారు. సంక్షేమ పథకాలు నిరంతరాయంగా కొనసాగాలంటే మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని గెలిపించుకోవాలన్నారు. తాను ఎక్కడా ఏ సమస్య వచ్చినా ప్రజలకు అందుబాటులో ఉండి పరిష్కరించేందుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేగా తెల్లం బాలరాజు అనేక సేవలు అందించారని, ప్రజల మన్ననలు పొందారని, ఆయన బాటలో ముందుకు సాగుతానని తెలిపారు.

అడుగడుగునా విశేష స్పందన

ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాజ్యలక్ష్మి పోలవరంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారానికి ప్రజల నుంచి అడుగడుగునా విశేష స్పందన లభించింది. ఆయా ప్రాంతాల్లో బాలరాజు, రాజ్యలక్ష్మి దంపతులకు మహిళలు నీరాజనం పలికారు. గతంలో ఏ ముఖ్యమంత్రి అమలు చేయనన్ని సంక్షేమ పథకాలు వలంటీర్ల ద్వారా నేరుగా ఇంటికే అందించిన ఘనత ఒక్క వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని, ఆయన్ను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకుంటామని ప్రజలు ముక్తకంఠంతో తెలియజేశారు. భారీ మెజార్టీతో తెల్లం రాజ్యలక్ష్మిని గెలిపించుకుంటామని ఈ సందర్భంగా తెలిపారు. యువత, మహిళలు, రైతులు అనేక మంది తమ ఓటు ఫ్యాన్ గుర్తుకే అంటూ భరోసా ఇచ్చారు.

గోపాలపురంలో వనితమ్మను గెలిపించుకుందాం


ఐఎస్ జగన్నాథపురంలో ప్రచారాన్ని నిర్వహిస్తున్న విజయ్‌కుమార్, పార్టీ శ్రేణులు

ఎన్నికల ప్రచారంలో మంత్రి వనిత సోదరుడు విజయకుమార్

ద్వారకాతిరుమల: గోపాలపురం నియోజకవర్గ ఎమ్మెల్యేగా మన ఆడపడుచు, రాష్ట్ర హోంశాఖ మంత్రి తానేటి వనితమ్మను గెలిపించుకుని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎం చేసుకుందామని ఆమె సోదరుడు జొన్నకూటి విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని ఐఎస్ జగన్నాథపురంలో విజయ్‌కుమార్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులు ఆశీర్వాదం, వెల్సన్ సోమవారం గడపగడపకు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నేతలతో కలసి ఇంటింటికీ వెళ్లి జగనన్న ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ ఇదే ప్రభుత్వానికి పట్టం కట్టాలని కోరారు. లేకుంటే ఇప్పుడు అందుతున్న అన్ని సంక్షేమ పథకాలు నిలిచిపోతాయని తెలిపారు. వలంటీర్ వ్యవస్థను పూర్తిగా తీసివేస్తారని చెప్పారు. కాబట్టి పేదలకు మంచి చేసే జగనన్న ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, ఐఎస్ జగన్నాథపురం, ఐఎస్ రాఘవాపురం సర్పంచ్‌లు పసుపులేటి ఏసుబాబు, దాకారపు బంగారమ్మ, పాకలపాటి త్యాగ భీమేశ్వరరావు, చెరుకూరి ప్రసాదరావు, బొండాడ వెంకన్నబాబు, వామిశెట్టి పరమేశ్వరరావు, మటపర్తి పుల్లయ్య, చెరుకూరి ప్రసాదరావు, చెలికాని బుల్లియ్య, జేసీఎస్ కన్వీనర్ భోగరాజు సాయికృష్ణ, ఆచంట సురేష్, వామిశెట్టి పరమేశ్వరరావు, పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు మల్లెపూడి నాగమణి, షేక్ భాషా, పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, మండల యూత్ అధ్యక్షుడు పెద్దిరెడ్డి నాగేశ్వరరావు తదితరులున్నారు.

రజకుల సమస్యలను పరిష్కరించాలి

చింతలపూడి: మూడు నెలలకు ఒకసారి జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించి రజకుల సమస్యలను పరిష్కరించాలని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా రజక సంఘం అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య కోరారు. చింతలపూడి రజక సంఘ భవనంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రజకవృత్తి దారులకు రజక చెరువులపై శాశ్వత హక్కు కల్పించాలన్నారు. నాయకులు పులిగడ్డ ప్రసాద్, నిమ్మగడ్డ దుర్గారావు, కొమ్మరాజు నాంచారయ్య, ఎస్.నారాయణ, నేరెళ్ళ లక్ష్మీనారాయణ, చెన్నారావు, బండి సూరిబాబు, సీహెచ్ రాము, సత్యన్నారాయణ పాల్గొన్నారు.